



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 27-01-2026 | సంపుటి - 26 | సంచిక -248 | రూ : 4 | పేజీలు: 8

2లో

## పరేడ్ గ్రౌండ్స్‌లో
# ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

- తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు, స్పీకర్
- అసెంబ్లీ, మండలి, సచివాలయంలోనూ రిపబ్లిక్ డే సంబరాలు



2లో

## భిన్నత్వంలో ఏకత్వం..
# తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని



- 77వ గణతంత్ర వేడుకల్లో రాజస్థానీ తరహా తలపాగాతో ప్రధాని
- ఎరుపు రంగు టై-డై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో ప్రత్యేక ఆకర్షణ
- ప్రతి ఏటా విభిన్న సంస్కృతులకు ప్రతీకగా తలపాగాలు ధరిస్తున్న మోదీ
- గతేడాది ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగా ధరించిన ప్రధాని



2లో

## బంగ్లాదేశ్‌లో హిందువులపై పెరుగుతున్న దాడులు...
## చెప్పాపెట్టకుండా వచ్చేసిన ఎన్టీపీసీ ఇంజినీర్లు

- బంగ్లా హింసాత్మక దాడుల్లో పలువురు హిందువుల మృతి
- అకస్మాత్తుగా బంగ్లాను వీడిన 9 మంది ఎన్టీపీసీ ఇంజినీర్లు
- ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలు మరింత పెరిగే అవకాశం

## అర్ధరాత్రి వేళ చెరువులో చిక్కుకుపోయిన వారిని
# కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్

- మిరాలం చెరువులో చిక్కుకుపోయిన 9 మంది సిబ్బంది
- బోటు ఇంజన్ మొరాయించడంతో అర్ధరాత్రి ఉత్కంఠ
- రంగంలోకి దిగి సాహసోపేతంగా కాపాడిన హైడ్రాడీఆర్ఎఫ్ బృందాలు
- రెండు విడతల్లో బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన వైనం
- హైడ్రాడీఆర్ఎఫ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు




2లో



2లో

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం..
# హిందూయేతరులకు ప్రవేశం బంద్

- ప్రతిపాదించిన ఆలయ కమిటీ బోర్డు
- త్వరలో జరగబోయే బోర్డు సమావేశంలో ప్రతిపాదనలకు ఆమోదం
- బోర్డు పరిధిలోకి వచ్చే ఇతర ఆలయాల్లోనూ ఇదే నిబంధన వర్తిస్తుందని వెల్లడి

## అమరావతిలో మొదటిసారిగా
# రిపబ్లిక్ డే వేడుకలు...

- అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకలు జరగడంపై సీఎం చంద్రబాబు హర్షం
- ఈ రిపబ్లిక్ డే ఏపీ ప్రజలకు చిరస్మరణీయమని వ్యాఖ్య
- ప్రభుత్వ ఎజెండాను వివరించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సీఎం
- పరేడ్, శకటాల ప్రదర్శన భవిష్యత్ ఆకాంక్షలకు అద్దం పట్టాయన్న చంద్రబాబు



2లో



2లో

## హార్వర్డ్ యూనివర్సిటీలో
# విద్యాభ్యాసం మొదలుపెట్టిన సీఎం

- హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా మారిన సీఎం రేవంత్ రెడ్డి
- 'లీడర్‌షిప్ ఇన్ 21వ శతాబ్దం' కోర్సులో చేరిక
- భారీ హిమపాతం, ప్రతికూల వాతావరణంలోనే తరగతులకు హాజరు
- సీఎం అమెరికా పర్యటనపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు
- ప్రజా బాధ్యతల కంటే వ్యక్తిగత ఆకాంక్షలకే ప్రాధాన్యతా? అని ప్రశ్న

# అర్ధరాత్రి వేళ చెరువులో చిక్కుకుపోయిన వారిని కాపాడిన హైడ్రా-డీఆర్ఎఫ్

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని మిరాలం చెరువులో చిక్కుకుపోయిన 9 మందిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సురక్షితంగా కాపాడాయి. ఆదివారం అర్ధరాత్రి బోటు ఇంజన్ మొరాయించడంతో చెరువు మధ్యలోనే ఉండిపోయిన ఇంజనీర్లు, కార్మికులను సిబ్బంది ఒడ్డుకు చేర్చారు. పాతబస్తీలోని జూ పార్కు సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటన, తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. వివరాల్లోకి వెళితే... మిరాలం చెరువుపై నిర్మించతలపెట్టిన వంతెన కోసం సాయిల్ టెస్ట్ చేసేందుకు కొంతమంది ఇంజనీర్లు, కార్మికులు ఆదివారం ఉదయం బోటులో చెరువులోకి వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా, చీకటి పడే సమయానికి వారు ప్రయాణిస్తున్న బోటు ఇంజన్ ఆగిపోయింది. దాన్ని బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఒడ్డున ఉన్న మెకానిక్‌కు ఫోన్ చేయగా, బోటు ఒడ్డుకు వస్తేనే బాగుచేయగలనని చెప్పడంతో వారిలో ఆందోళన మొదలైంది. బోటును చేతులతో నెట్టుకుంటూ ఒడ్డుకు వద్దామని ప్రయత్నించగా, చెరువులో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క అడ్డుగా మారింది. దీంతో బోటు ముందుకు కదలలేదు. చుట్టూ చిమ్మచీకటి, మరోవైపు ఆ చెరువులో మొసళ్లు ఉంటాయనే భయంతో వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. ఏం చేయాలో పాలుపోని స్థితిలో వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న డీఆర్ఎఫ్ కంట్రోల్ రూమ్ వెంటనే స్పందించింది. హైడ్రా ఎస్ఎఫ్ఓ జమీల్, రెస్క్యూ టీమ్ ఇన్‌చార్జి స్వామి నేరుగా చెరువులో చిక్కుకున్నవారితో ఫోన్‌లో మాట్లాడారు. "మేము వస్తున్నాం, ఎంత రాత్రైనా మిమ్మల్ని సురక్షితంగా బయటకు తీసుకొస్తాం, ధైర్యంగా ఉండండి" అని భరోసా ఇచ్చారు. దట్టమైన చీకటి, గుర్రపు డెక్క కారణంగా బాధితులు ఉన్న ప్రదేశాన్ని గుర్తించడం డీఆర్ఎఫ్ సిబ్బందికి సవాలుగా మారింది. బాధితులు తమ సెల్ ఫోన్ లైట్ల ద్వారా సిగ్నల్ ఇవ్వగా, డీఆర్ఎఫ్ బృందాలు టార్చ్ లైట్ల సాయంతో అతి కష్టం మీద వారి వద్దకు చేరుకున్నాయి. మొదటి విడతలో నలుగురిని, ఆ తర్వాత రెండో విడతలో మిగిలిన ఐదుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఒడ్డుకు చేరడంతో బాధితులంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో తమను కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపారు. నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూ ధైర్యం చెప్పడమే కాకుండా, సాహసోపేతంగా తమను కాపాడారని కార్మికులు, స్థానికులు కొనియాడారు.

## తెలంగాణలో ఘనంగా
# రిపబ్లిక్ డే వేడుకలు..

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అధికారిక కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాజరయ్యారు. అంతకుముందు తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలిలో ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్ర సచివాలయంతో పాటు జిల్లా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లోనూ రిపబ్లిక్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.

# బంగ్లాదేశ్‌లో హిందువులపై పెరుగుతున్న దాడులు...

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్‌లో మైనార్టీలు, ముఖ్యంగా హిందువులపై కొనసాగుతున్న హింసాత్మక దాడులు ఆ దేశంలోని భారతీయుల భద్రతపై తీవ్ర ఆందోళనలు రేపుతున్నాయి. గత కొన్ని నెలలుగా అనేక ప్రాంతాల్లో హిందువుల ఇళ్లు, ఆలయాలు, ఆస్తులపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల్లో పలువురు మరణించారు, ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో పనిచేస్తున్న భారతీయులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ఫలితంగా, ప్రైవేట్ సెక్టార్ ఉద్యోగులతో పాటు కేంద్ర సంస్థల ఉద్యోగులు కూడా ఆ దేశాన్ని వీడుతున్నారు. భారత రాయబార కార్యాలయం సూచనల మేరకు చాలా మంది తమ కుటుంబ సభ్యులను ఇండియాకు పంపించారు. తాజా ఘటనలో, కేంద్ర విద్యుత్ రంగ సంస్థ ఎన్టీపీసీకి చెందిన 9 మంది ఇంజినీర్లు బంగ్లాదేశ్‌ను అకస్మాత్తుగా వీడి ఇండియాకు తిరిగి వచ్చారు. ఇండియా బంగ్లాదేశ్ మైత్రి ఒప్పందం కింద బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ (BIFPCL) పేరిట నిర్వహిస్తున్న రాంపాల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈ ఇంజినీర్లు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. అయితే, దేశంలో నెలకొన్న అల్లర్లు, హింసాత్మక ఘటనల నేపథ్యంలో వారు గత శనివారం భోమ్రా సరిహద్దు మార్గం ద్వారా ఇండియాకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే, వారు అక్కడి అధికారుల నుంచి అనుమతి తీసుకోకుండానే, నోటీసు ఇవ్వకుండానే దేశం వీడారు. పవర్ ప్లాంట్ అధికారులు తనిఖీ చేసినప్పుడు వారు విధులకు హాజరు కాలేదని తెలిసి ఆశ్చర్యపోయారు. బంగ్లాదేశ్‌లో గత ఆగస్టు 2024 నుంచి జూన్ 2025 వరకు హిందువులపై 2,442కు పైగా దాడి ఘటనలు జరిగాయని హిందూ బౌద్ధ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ (HBCUC) తెలిపింది. ఈ దాడులు రాజకీయ అస్థిరత, మత ఛాందసవాదం కారణంగా పెరుగుతున్నాయి. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఈ హింస మరింత తీవ్రమవుతుందని హిందూ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## భారత్‌తో మాది చారిత్రక బంధం
# రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన ట్రంప్

అమెరికా : భారత్ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రభుత్వానికి, ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అత్యంత పురాతన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలుగా అమెరికా, భారత్‌ల మధ్య చారిత్రాత్మక బంధం ఉందని ఆయన కొనియాడారు. సోమవారం ట్రంప్ సందేశాన్ని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో పంచుకుంది. "మీ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమెరికా ప్రజల తరఫున భారత ప్రభుత్వానికి, ప్రజలకు నా హృదయపూర్వక అభినందనలు" అని ట్రంప్ తన సందేశంలో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా భారత ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఏడాదిలో ఉమ్మడి లక్ష్యాల సాధనకు కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు. "రక్షణ, ఇంధనం, కీలక ఖనిజాలు, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాల్లో మన మధ్య బలమైన సహకారం ఉంది. క్వాడ్ వేదికగా బహుళస్థాయి భాగస్వామ్యంతో ఇరు దేశాలకు, ఇండో పసిఫిక్ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతోంది" అని రూబియో తన ప్రకటనలో వివరించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి, దేశం సార్వభౌమ ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటారు. రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య సంప్రదాయాలను చాటుతూ దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ పరేడ్, దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తారు.

# అమరావతిలో మొదటిసారిగా రిపబ్లిక్ డే వేడుకలు..

అమరావతి: ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించడం ఒక చారిత్రాత్మక ఘట్టమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ఏడాది రిపబ్లిక్ డే రాష్ట్ర ప్రజలకు ఎంతో గర్వకారణమని, చిరకాలం గుర్తుండిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ చారిత్రక సందర్భంపై చంద్రబాబు సోమవారం స్పందిస్తూ.. అమరావతిలో మువ్వన్నెల జెండాను ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ఎజెండాను, భవిష్యత్ కార్యాచరణను గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ స్పష్టంగా వివరించారని, ఇందుకు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ట్వీట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ పరేడ్, అందంగా తీర్చిదిద్దిన శకటాల ప్రదర్శన మన సమష్టి ఆశయాలకు, భవిష్యత్ దృష్టికి అద్దం పట్టాయని చంద్రబాబు ప్రశంసించారు. ఈ వేడుకలను వీక్షించడం ఎంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొంటూ 'జైహింద్' అని తన ప్రకటనను ముగించారు.

## భిన్నత్వంలో ఏకత్వం..
# తలపాగాతో సందేశమిచ్చిన ప్రధాని మోదీ


ఢిల్లీ: భారతదేశం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న వేళ, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తన ప్రత్యేకమైన తలపాగాతో అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో దేశంలోని ఏదో ఒక ప్రాంత సంస్కృతిని ప్రతిబింబించేలా తలపాగా ధరించడం మోదీకి అలవాటు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఈసారి రాజస్థానీ శైలిని పోలిన తలపాగాలో కనిపించారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించిన ప్రధాని మోదీ, ఎరుపు రంగు టైడై వస్త్రంపై బంగారు జరీ వర్క్‌తో కూడిన తలపాగాను ధరించారు. సిల్క్ బ్రోకేడ్ వస్త్రంతో తయారు చేసిన ఈ తలపాగా రాజస్థానీ హస్తకళా నైపుణ్యాన్ని గుర్తుకు తెచ్చింది. దీనికి మ్యాచింగ్‌గా నీలం, తెలుపు రంగుల కుర్తాపైజామా, లేత నీలం రంగు జాకెట్‌ను ధరించారు. ప్రధాని మోదీ 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి గణతంత్ర దినోత్సవాల్లో విభిన్నమైన తలపాగాలు ధరించడం ఒక సంప్రదాయంగా మారింది. ఇవి కేవలం ఫ్యాషన్ కోసం కాకుండా, భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తారు. గతేడాది 76వ గణతంత్ర దినోత్సవం నాడు రాజస్థాన్, గుజరాత్‌లలో ప్రసిద్ధి చెందిన ఎరుపు, పసుపు రంగుల బాంధేజ్ తలపాగాను ధరించారు. గతంలో ఉత్తరాఖండ్ టోపీ, బహుళవర్ణ బాంధనీ ప్రింట్లు వంటివి ధరించి వివిధ రాష్ట్రాల సంస్కృతులకు గౌరవమిచ్చారు. జాతీయ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పించిన అనంతరం, ప్రధాని కర్తవ్య పథ్‌లో జరిగే పరేడ్‌ను వీక్షించడానికి చేరుకున్నారు. జాతీయ గీతం వందేమాతరం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా "వందేమాతరం 150 ఏళ్లు" అనే థీమ్‌తో ఈ ఏడాది వేడుకలను నిర్వహిస్తున్నారు.

## బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ ట్రస్ట్ కీలక నిర్ణయం...
## హిందూయేతరులకు ప్రవేశం బంద్

ఉత్తరాఖండ్, జనవరి 26 : ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని శతాబ్దాల చరిత్ర కలిగిన బద్రీనాథ్, కేదార్‌నాథ్ దేవాలయాలలోకి ఇకపై హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. చార్‌ధామ్ దేవాలయాలలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించాలని ఆలయ నిర్వహణ సంస్థ ప్రతిపాదించింది. త్వరలో జరగబోయే కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయ కమిటీ (కేబీటీసీ) బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. కేబీటీసీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ఈ విషయంపై మాట్లాడుతూ, ఈ రెండు ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే ఇతర దేవాలయాల్లోనూ ఇదే నిబంధన వర్తిస్తుందని తెలిపారు. ఇదివరకే గంగోత్రి ధామ్‌లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించారు. ఆదివారం జరిగిన గంగోత్రి టెంపుల్ కమిటీ సమావేశంలో దీనిపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో కేబీటీసీ ప్రతిపాదన కూడా వచ్చింది. అయితే ఈ నిబంధన ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయంపై నిర్ణయం వెలువడాల్సి ఉంది.

# సమాధులను తవ్వి.. చివరి బందీ అవశేషాలను వెలికితీసి!

గాజాలోని చివరి బందీ రాన్ జివిలీ అవశేషాలను ఇజ్రాయెల్ ఎట్టకేలకు స్వాధీనం చేసుకుంది. ఆ దేశ సైన్యం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. అమెరికా మధ్యవర్తిత్వంలో కుదిరిన గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లాలంటూ ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెరుగుతున్న వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. జివిలీ అవశేషాల అన్వేషణ పూర్తయితే.. ఈజిప్టు గాజా సరిహద్దులోని రఫా క్రాసింగ్ గుండా రాకపోకలు సాగించేందుకు పాలస్తీనీయులకు అనుమతి ఇస్తామని ప్రధాని నెతన్యాహు కార్యాలయం ఇప్పటికే తెలిపింది. రాన్ జివిలీ (24) అవశేషాలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇజ్రాయెల్‌కు, సైన్యానికి అద్భుత విజయంగా ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ''ప్రతి ఒక్క బందినీ స్వదేశానికి తిరిగి తీసుకొస్తానని వాగ్దానం చేశాను. ఆ పని చేసి చూపించాను'' అని మీడియాతో అన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఉగ్రవాదులు



జరిపిన మెరుపు దాడుల్లో పోలీసు అధికారి జివిలీ మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని గాజాకు తీసుకెళ్లారు. రాన్ జివిలీ అవశేషాల కోసం గాజాలోని శ్మశానవాటికలను ఇజ్రాయెల్ బృందాలు జల్లెడ పట్టాయి. ఈ క్రమంలో సమాధులనూ తవ్వినట్లు తెలుస్తోంది. ''నిఘా వర్గాల సమాచారం ఆధారంగా షుజాయ్యా, దరాజ్, తుఫా ప్రాంతాల్లో గాలింపు చేపట్టాం. సైనికులతో పాటు యూదు మతపెద్దలు, దంత నిపుణులు ఈ ప్రక్రియలో భాగమయ్యారు'' అని ఓ సైనిక అధికారి వెల్లడించారు. ఇటీవల తుఫా పరిసరాల్లో ఓ శ్మశానవాటికలో అన్వేషణ చేపట్టారని, సమాధులను తవ్వి.. మృతదేహాలను బయటకు తీసి.. అనంతరం వాటిని అలాగే వదిలేశారని స్థానికులు తెలిపారు. అతడి అవశేషాలు ఎక్కడ వెలుగుచూశాయనే విషయాన్ని ఇజ్రాయెల్ వెల్లడించలేదు. ప్రాణాలతో ఉన్నా లేదా చనిపోయినా.. బందీలందరినీ గాజా నుంచి తీసుకురావడమనేది కాల్పుల విరమణ మొదటి దశలో కీలకంగా ఉంది. ఇందులో భాగంగా 20 మందిని సజీవంగా విడుదల చేసిన హమాస్.. మరో 27 మంది అవశేషాలను అప్పగించింది. జివిలీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకునేవరకు రెండో దశకు అంగీకరించొద్దని అతడి కుటుంబం ఇటీవల ఇజ్రాయెల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తాజాగా అతడి అవశేషాలు లభ్యం కావడంతో.. రెండో దశకు మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది. హమాస్ నిరాయుధీకరణ, పాలనను గాడిలో పెట్టడం వంటివి ఈ దశలో భాగంగా ఉన్నాయి.

## హార్వర్డ్ యూనివర్సిటీలో
## విద్యాభ్యాసం మొదలుపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో తన ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న కెన్నడీ స్కూల్‌లో 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ సెంచరీ: కేయాస్, కాన్‌ఫ్లిక్ట్, అండ్ కరేజ్' అనే కోర్సులో ఆయన చేరారు. ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం ప్రోగ్రామ్ ఓరియంటేషన్, సహ విద్యార్థుల పరిచయంతో తరగతులు మొదలయ్యాయని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. ఈ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి వివిధ తరగతులు, కేస్ స్టడీ అనాలిసిస్, కన్సల్టేటివ్ గ్రూప్ వర్క్‌లో పాల్గొంటున్నారు. ఈ కోర్సులో భాగంగా ఆయన ఇతర విద్యార్థులతో కలిసి అసైన్‌మెంట్లు, హోంవర్క్, గ్రూప్ ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంటుంది. జనవరి 30 వరకు ఈ తరగతులు కొనసాగుతాయి. కోర్సు పూర్తయ్యాక రేవంత్ రెడ్డి హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ముఖ్యమంత్రి పదవిలో ఉండగా ఐవీ లీగ్ యూనివర్సిటీలో ఇలాంటి కోర్సులో చేరడం ఇదే తొలిసారని సీఎంవో పేర్కొంది. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి వచ్చిన వారు ఈ తరగతులకు హాజరవుతున్నారు. మరోవైపు, బోస్టన్ ప్రాంతంలో 'ఫెర్న్' అనే మంచు తుపాను కారణంగా అత్యవసర పరిస్థితి నెలకొంది. రెండు అడుగుల మేర హిమపాతం, మైనస్ 20 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇంతటి ప్రతికూల వాతావరణంలోనూ రేవంత్ రెడ్డి తరగతులకు హాజరవుతున్నారు. గత వారం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా అమెరికా వెళ్లారు. అయితే, సీఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో కోర్సులో చేరడంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పించింది. నాయకత్వం అనేది స్వల్పకాలిక కోర్సుల ద్వారా కాకుండా, పాలన, జవాబుదారీతనం, క్షేత్రస్థాయిలో ఫలితాల ద్వారా నిరూపించుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ వ్యాఖ్యానించారు. "ఇలాంటి అకడమిక్ కోర్సులను జీవితంలో ముందే పూర్తి చేయాల్సింది కదా?" అని ఆయన ప్రశ్నించారు.

# చైనా మాంజా మెడకు చుట్టుకొని బైక్‌పై వెళ్తున్న ఐదేళ్ల బాలిక మృతి

హైదరాబాద్ : నిషేధిత చైనా మాంజా మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సంక్రాంతి పండుగ వేళ గాలిపటాలు ఎగురవేసేందుకు వాడే ఈ ప్రమాదకరమైన దారం, ప్రయాణికులకు శాపంగా మారుతోంది. సోమవారం సాయంత్రం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది.

**తండ్రి కళ్ల ముందే కూతురు మృతి**

సంగారెడ్డి జిల్లా కాజీపల్లికి చెందిన ఒక వ్యక్తి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై కూకట్‌పల్లి వైపు వెళ్తున్నారు. వివేకానంద నగర్ లోని హైవే వద్దకు చేరుకోగానే, గాలిలో నుంచి తెగి పడిన చైనా మాంజా ఐదేళ్ల బాలిక నిష్విక ఆదిత్య మెడకు చుట్టుకుంది. దారం మెడకు బలంగా దిగబడటంతో తీవ్ర గాయమై బాలిక బైక్ పై నుంచి కిందపడిపోయింది. గొంతు వద్ద తీవ్రమైన కోత పడటంతో విపరీతంగా రక్తస్రావం జరిగి, బాలిక తన తండ్రి కళ్ల ముందే ప్రాణాలు వదిలింది.

# కాప్రా ప్రెస్ క్లబ్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

కాప్రా ,ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం కాప్రా ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా జరిగాయి. కుషాయిగూడ ఏసీపీ వై.వెంకటరెడ్డి, ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్సైసాయి తదితరులు పాల్గొని జెండవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, ఉపాధ్యక్షులు అదిమూలం శ్రీనివాస్, గోపాల్




గౌడ్, వట్టిపల్లి సురేష్, నటరాజ్ , సీనియర్ జర్నలిస్టులు, సలహాదారులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి, కేసరి సహదేవ చారి, కేసీ మోహన్, ఎం.చంద్రమౌళి,శనిగరం అశోక్, కే.సత్యనాయన, గడ్డమీది బాలరాజు,కీర శ్రీనివాస్, జర్నలిస్టులు దామెరపల్లి నర్సింహ రెడ్డి,లక్కిడి బాల్ రెడ్డి, చుక్క రమేష్, శ్రీనివాస్, బసంత్ రెడ్డి, దాచారం రమేష్, బాలకృష్ణ, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : భారత 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం మేడిపల్లి ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్ జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చిర్ర శ్రీధర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ముఖ్య సలహాదారులు కల్కూరి ఎల్లయ్య, కోశాధికారి మారాటి మల్లేష్ ,సంయుక్త కార్యదర్శులు చిన్నం మధు ,నీరుడు అంజన్ , కార్యవర్గ సభ్యులు బుషా గణేష్ ,శేరి కరుణాకర్ రెడ్డి ,సభ్యులు సీహెచ్ రవి కుమార్ ,కొండకింద సురేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## పాపిరెడ్డి నగర్ లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవాన్ని బస్తి లోని రోడ్ నెం.01లో స్థానిక నేతలు, బస్తి వాసుల సమక్షంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తూ జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం పలువురు పాఠశాల విద్యార్థులు చేపట్టిన వివిధ విన్యాసాలను తిలకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, పేర్ని ధర్మారావు, హనుమంత రెడ్డి, ముత్యం వెంకట్ రెడ్డి, రాంరెడ్డి , కె.వి.రాజు, అనంత రాములు, అడెపు ప్రభాకర, హనుమంత రెడ్డి, జీ.బి కన్నారావు, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రయ్య, పాండు గౌడ్, మోహన్ రెడ్డి, వనం ఆంజనేయులు, సాంబశివుడు, టీ.రాజీ రెడ్డి, శరత్ రెడ్డి, వసంత రెడ్డి, తాటి కిరణ కనకయ్య, ఎస్ యాదగిరి, మేస్త్రి ఎల్లారెడ్డి, హెచ్ రాజు రెడ్డి, కనకా రెడ్డి, జగదీష్ ,నరసింహ. జగన్మోహన్ రెడ్డి, వీరయ్య ముదిరాజ్, నరసింహులు, రాజేందర్, గజేంద్ర రెడ్డి, .మోహన కృష్ణ ,శంకర్ రెడ్డి, డి.తిరుపతి రెడ్డి, జగన్. భాస్కర్ గౌడ్ భాస్కర్ గుప్తా రమేష్ చంద్రారెడ్డి. లక్ష్మి అరుణ. కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జీడిమెట్ల లోని గవర్నమెంట్ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ కాలేజ్ బాయ్స్ హాస్టల్ నందు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వి కొండలరావు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ఆట పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

## మాధవరం నగర్ కాలనీ లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు




శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి ) : వివేకానంద నగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీ లో డివిజన్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జాతీయ జెండాను స్థానిక నాయకులతో కలిసి ఎగరవేశారు. అనంతరం వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.




## ఎన్టీఆర్ పార్కులో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ ఎన్టీఆర్ పార్క్ , ఏనుగు బొమ్మల చౌరాస్తాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో జాతీయ పతాకావిష్కరణ , భరతమాత పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ పార్కులో జరిగిన భరతమాత పూజలో పలువురు స్థానికులు పాల్గొన్నారు. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో పూర్తి గేయాన్ని ఆలపించారు. ఏనుగుబొమ్మల చౌరాస్తాలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, భరతమాత పూజ నిర్వహించి, పూర్తి వందేమాతరం గేయాన్ని ఆలపించి తదనంతరం మిఠాయిలు పంచుకున్నారు. ప్రగతినగర్ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, రామారావు, రచ్చ చక్రధర్, సత్య కాటేపల్లి, రామకిశోర్, గోపాల్ రెడ్డి, సత్యనారాయణ, బండి చంద్రశేఖర్, నాగేశ్వర రావు, విశ్వనాథ్, కెఎస్ ప్రకాశ్, శ్రీనివాస రావు, రంగనాథ్, ఎమ్ విష్ణు, ధారవత్ బాలాజీ నాయక్, కల్యాణి, సుధాకర్, అంకయ్య, వెంకట్, వంశీవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల హక్కుల సాధనలో కలిసినడుద్దాం

- **ముదిరాజ్ సంఘం అద్యక్షుడు కాల్వమీది రాములు**
- **కన్‌సాన్‌పల్లి ముదిరాజ్ సంఘ కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక**

అందోల్, ప్రజాస్ఫూర్తి: ముదిరాజ్ కులస్తులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కలిసి పోరాడుదామని ముదిరాజ్ సంఘ అధ్యక్షుడు కాల్వమీద రాములు అన్నారు. సోమవారం అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామ ముదిరాజ్ సంఘం కార్యవర్గ ఎన్నిక జరిగింది. తాజామాజీ అధ్యక్షుడు మొరబోయిన ఈశ్వరయ్య అధ్యక్షతన సంఘ సభ్యులు సమావేశమై నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా పోటీచేసేవారు ముందుకు రావాలని తెలియజేయగా కాల్వమీది రాములును అందరూ బలపర్చడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యాక్షుడిగా దేవునూరి నర్సింలు, ప్రధానకార్యదర్శిగా మొరబోయిన మహేష్, కార్యదర్శిగా దేవునూరి రవి, కోశాధికారిగా పట్ల రమేశ్, డైరెక్టరులుగా చెక్రాల వెంకయ్య, జోగాల అంజయ్య, పంతులు ఈశ్వర్, రామన్నగారి సత్తయ్య, వని యాదయ్య, రామన్నగారి నాగయ్య, వని శంకర్, బి.అంజనేయులు, సంగాన్నగారి ప్రవీణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాల్సిన అవసరం ఉందన్నారు. విద్య ఉపాది అవకాశాలు పొందడంలో ముదిరాజుల స్వప్నమైన గ్రూపు డి నుండి గ్రూపు ఏలో చేర్చాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దీని సాధనలో రాష్ట్ర నాయకత్వంతో కలిసి పనిచేద్దమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులు మహిపాల్, మొరబోయిన క్రిష్ణ,తెనుగు ప్రవీణ్, జోగాల గోవర్ధన్, మోహన్, జైరాంలు,చింతకుంట ఎల్లయ్య,వని పోచయ్య, రామన్నగారి అంజనేయులు, సుదర్శన్, దేవునూరి ప్రవీణ్, వని దుర్గయ్య, దేవునూరి కిషన్, కాల్వమీది నర్సింలు, దేవునూరి శంకరయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.





## వైష్ణవి టెక్నో స్కూల్లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలను, సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చిన్నారులు వేసిన మహనీయుల వేషధారణలు చూపరుల ను ఆకర్షించాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




ఉప్పల్, ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పల్ డిపో , బోడుప్పల్‌లో ఉన్న శ్రీ చైతన్య ఈటెక్నో స్కూల్, శ్రీ చైతన్య ప్రైమ్ స్కూల్ , శ్రీ చైతన్య ఒలింపియాడ్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలను ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి, డైరెక్టర్ సామ అభిషేక్ రెడ్డి లు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ లో ఘనంగా గణ తంత్ర దినోత్సవ వేడుకలు



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లో గల నాలెడ్జ్ ఐకాన్ స్కూల్ లో గణ తంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మన్నే రాజు ,సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ లు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాలెడ్జ్ స్కూల్ ప్రిన్సిపల్ అరుణ, బస్తీ వాసులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య వృత్తిలో ఉత్తమ సేవకు ప్రశంసా పత్రం



ప్రజాస్ఫూర్తి, సిద్ధిపేట: సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సురక్ష ఆసుపత్రి ద్వారా వైద్య వృత్తిలో ఉత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్ (సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్) ప్రశంసా పత్రం అందుకున్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సిద్ధిపేట జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకల సందర్భంగా వైద్య వృత్తిలో మంచి సేవలు అందిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేసి, అభినందనలు తెలిపారు. ఉత్తమ వైద్యునిగా ఎంపికైన డాక్టర్ రాజ్‌కుమార్‌ను ఈ సందర్భంగా శ్రీ సురక్ష ఆసుపత్రి యాజమాన్యం అభినందనలు తెలిపింది.

## ఎస్పీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.జిల్లా ప్రజలు,పోలీసు అధికారులు మరియు సిబ్బందికి 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి,ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,ఎస్బి ఇన్స్పెక్టర్స్ శ్రీనివాస్,జిల్లా కార్యాలయ అధికారులు,సిబ్బంది,ఆర్ఐలు,సీఐలు,ఎస్సైలు,జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## భైంసా మున్సిపల్ బిఆర్ ఎస్ ఎన్నికల ఇంచార్జీగా జక్కా

మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : ముథోల్ నియోజకవర్గం భైంసా మున్సిపాలిటీకి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ని ఇన్చార్జిగా నియమించారు.ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును వివరించి, పార్టీ ఆశయాలను బలంగా ప్రజల మధ్యకు తీసుకెళ్లేలా పూర్తి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

# ముస్తాబాద్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రజాస్పూర్తి, ముస్తాబాద్: 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ముస్తాబాద్ మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. తహశీల్దార్ కార్యాలయంలో రాంచందర్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ లచ్చాలు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ ఐ సిహెచ్ .గణేష్, సెస్ కార్యాలయంలో డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ జడ్పి హెచ్ ఎస్‌లో ఎంఇఓ రాజిరెడ్డి, ముస్తాబాద్ గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో దామోదర్ రావు, సర్వర్ పాషా, పాలక సభ్యులు, పలువురు అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులున్నారు.

## డాక్టర్ దయాల్ కు ఘన సన్మానం



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారిగా గత ఆగస్టు వరకు అత్యంత సమర్థవంతంగా, నిజాయితీగా, ఖచ్చితంగా తన విధులను నిర్వహించి మండల విద్యాశాఖకు రాష్ట్రస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు సాధించి రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా చే ప్రత్యేకంగా గుర్తించబడిన డాక్టర్ ప్రభు దయాల్ ను రిపబ్లిక్ డే సందర్భంగా సెయింట్ ఆండ్రూస్ చర్చి చైర్మన్ రేవ అభిజిత్ మరియు దోర్నకల్ డయాసిస్ విద్యాశాఖ కార్యదర్శి రత్నరాజులు ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖను సరైన గాడిలో ఉంచుతూ, బీద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి పాఠశాలలకు ప్రత్యేక గుర్తింపును సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రూస్ చర్చి సంఘ పెద్దలు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చేవెళ్ల పట్టణంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



చేవెళ్ల , (ప్రజాస్పూర్తి ) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేవెళ్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పాల్గొని జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మోజిగూడెంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

* **జాతీయ జెండాను ఎగరవేసిన సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎదుట జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలోనే గొప్పగా భారత రాజ్యాంగం రూపొందించాలన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, సామిడి సంధ్య, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, జీడిముడ్ల శోభ కొండల్, గునుగంటి వెంకటేశం, జంగం వెంకటమ్మ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్ ను అభినందించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్



కొత్తగూడెం , ప్రజాస్పూర్తి : గణతంత్ర దినోత్సవం సందర్భంగా యువ కవి, చిత్రకారుడు రాజేష్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని కలిసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాను వేసిన పెన్సిల్ ఆర్ట్ ను కలెక్టర్ కి అందజేశారు.చిత్రాన్ని ఆసక్తిగా తిలకించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ చిత్రం చాలా బాగా గీసారని రాజేష్ ను అభినందించారు. గతంలో జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చిత్రాన్ని కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో వారికి బహుకరించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.




## కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్న నైనిక

ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : ప్రకృతి పరిరక్షణలో అందిస్తున్న విశేష సేవలకు గాను ప్రకృతి సేవకురాలు నైనిక రజావాకు 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రశంసాపత్రం అందజేశారు. సోమవారం కొత్తగూడెం పట్టణంలోని ప్రగతి మైదానంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నైనికకు ప్రశంసాపత్రం అందచేసి అభినందించారు. ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు, గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ రూపకర్త, 114వ మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రశంసలు అందుకున్న మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక మొక్కలు నాటడం, మొక్కలను బహుమతిగా ఇవ్వడం వంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తూ, స్టీల్ బాటిళ్ల వినియోగంపై ప్రజలను చైతన్యపరుస్తున్నారు. నేడు మొక్కలు నాటకపోతే ఆక్సిజన్ కోసం రేపు మొక్కలను వీపున మోయాల్సి వస్తుందనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. తిరుమల కొండల్లో అలిపిరి మెట్ల మార్గం, సైన్స్ ఫెయిర్, పాల్వంచలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న సభలో సైతం నైనిక వినూత్న పర్యావరణ ప్రచారంతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఇలాంటి పలు కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు నైనిక చేస్తున్న కృషిని కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ విద్యా చందన పాల్గొన్నారు.



## ఏఈఓ కళ్యాణ్ కు ఉత్తమ పురస్కారం...

అందోలు,ప్రజాస్పూర్తి: 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాన్ని వట్ పల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ ) గొల్ల కళ్యాణ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఏఈఓ కళ్యాణ్ మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యసాయనికి కావాల్సిన ఎరువులు, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చిన యంత్రలను రైతులకు అందించి వారికి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండటం వల్ల ప్రభుత్వం గుర్తించి పురస్కార పత్రాన్ని అందించిందన్నారు. జిల్లా కలెక్టర్ చేతుల మీద ఉత్తమ సేవా పురస్కార పత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కార గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ఏఈఓ కళ్యాణ్ కు తమ సేవ పురస్కారం రావడం అందడం పట్ల తన స్వగ్రామమైన అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామస్తులు, ఆయన స్నేహితులు, అభిమానుల నుండి అభినందనలు వెలువత్తాయి

## ఉత్తమ ఉద్యోగిగా నిలిచిన సెర్ఫ్ డాటా ఎంట్రీ ఆపరేటర్

- **కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం**

ప్రజాస్పూర్తి, సిరిసిల్ల : సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో సెర్ఫ్ విభాగంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కోకంటి శిరీష ఉత్తమ ఉద్యోగిగా నిలిచారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరిగిన వేడుకల సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ చేతుల మీదుగా కోకంటి శిరీష ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సెర్ఫ్ విభాగంలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఆమె ఉత్తమ సేవలు అందించడం పట్ల కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తి రానున్న రోజుల్లో కొనసాగించాలని సూచించారు.



ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రం అందుకున్న కోకంటి శిరీషను తోటి ఉద్యోగులు అభినందించారు.

## శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు

జగద్గిరిగుట్ట, ప్రజాస్పూర్తి : 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, భగత్ సింగ్ మార్గ్ లోగల శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో జాతీయ జెండా ను మేడ్చల్ జిల్లా ట్రస్మా ప్రధాన కార్యదర్శి , పాఠశాల కరస్పాండెంట్ బిర్రు ఆంజనేయులు,ప్రిన్సిపాల్ బిర్రు శోభారాణిలు అధ్యాపక బృందంతో కలిసి జాతీయ జెండాను ఎగరవేశారు.అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంతి,అన్నె ఫాతిమా,ప్రసన్న,సరళ, కృషవేణి,మహేశ్వరీ,సాజిత సుభాషిణి పాల్గొన్నారు.




## పాల్వంచ నారాయణ పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవం



ప్రజా స్పూర్తి,పాల్వంచ: పట్టణం నెహ్రూనగర్‌లోని నారాయణ పాఠశాలలో సోమవారం 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ పూరేటి నరసింహారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరుల త్యాగాలను స్మరించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా 6వ తరగతి విద్యార్థిని రిషిక చేసిన యోగ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మిఠాయిల పంపిణీతో వేడుకలు ముగిశాయి.


## ప్రభుత్వాల ఏర్పాటు చేయడంలో ఓటు హక్కు ఎంతో కీలకం

* **బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి**



అక్షర గళం, కుత్బుల్లాపూర్ : ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాల ఏర్పాటు చేయడంలో ఓటు హక్కు ఎంతో కీలకమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి అన్నారు. గాజుల రామారం డివిజన్ మల్లారెడ్డి నగర్ ఫేస్ 1 లోని గాంధీ చౌక్ వద్ద బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన ఓటర్ల నమోదు, ఓటర్ కార్డుల్లో చేర్పులు, మార్పులను చేపట్టెందుకు నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తెలంగాణ సాయి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతి, యువకులకు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందుకున్న పోతుగల్ ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్



ప్రజాస్పూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ ఎస్‌బిఐ వ్యవసాయ వాణిజ్య శాఖ బ్రాంచ్ మేనేజర్ సలానా శ్రీకాంత్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఆయనను జిల్లా అధికార యంత్రాంగం ఉత్తమ ఉద్యోగిగా ఎంపిక చేసింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పోతుగల్ ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ సలానా శ్రీకాంత్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

## విద్యార్థులకు బెల్టులు అందజేత



బోడుప్పల్, ప్రజాస్పూర్తి : బోడుప్పల్ సర్కిల్ పెంటా రెడ్డి కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పిఆర్పి యూత్ ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు ఉచితంగా బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు మధు, సురేంద్ర నాయుడు, ముత్యమాచారి,రామకృష్ణ రాజు, లింగయ్య,సంపత్ రెడ్డి,నవీన్, అజయ్,అరుణ్, జీవన్ రావు పాల్గొన్నారు.

# కొత్తగూడెం డీఎస్పీగా ఆదినారాయణ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం సబ్‌డివిజన్ నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఎల్. ఆదినారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డీఎస్పీగా విధులు నిర్వహించిన ఎస్.కె. అబ్దుల్ రెహమాన్ నుండి ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆదినారాయణ గతంలో కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా సమర్థవంతంగా సేవలు అందించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# ఠాగూర్స్ హై స్కూల్ లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం రంగారెడ్డినగర్ డివిజన్,పరిధి గాంధీనగర్ లోని ఠాగూర్స్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు క్లిక్స్ క్యాపిటల్ సంస్థ సౌత్ జోనల్ మేనేజర్ ఎం.భాస్కరరావు, అభీష్ట ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకట్ వనం,ఆగర్ సైబరెక్స్ సంస్థ అధినేత సుమన్ సానం,సాఫ్ట్ వేర్ ఎక్స్ పర్ట్ (నిపుణులు) శ్రీకాంత్ రాయవరపు,పాఠశాల చైర్మన్,కరస్పాండెంట్ బండారి సాయికుమార్,డైరెక్టర్ బండారి నేహ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. చిన్నారి విద్యార్థులు వేసిన మహనీయుల వేషధారణలు చూపరుల ను ఆకర్షించాయి. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు జల్దా లక్ష్మీనాథ్, మాజీ వార్డు సభ్యులు అబ్దుల్ ఖాదర్,సామాజికవేత్త ఇక్కుర్తి నారాయణరావు,స్థానిక డాక్టర్. శాంతిభూషణం, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంచశీల పాఠశాల లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం మూసాపేట డివిజన్ పరిధి లోని పంచశీల పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ పాల్గొని జాతీయ పతకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. విద్యార్థులు వేసిన మహనీయుల వేషధారణలు చూపరుల ను ఆకర్షించాయి. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జోగిపేటలో ఘనంగా చిట్టిబాబు జన్మదిన వేడుకలు

అందోలు, ప్రజాస్ఫూర్తి :జోగిపేట మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు జన్మదిన వేడుకలు వందలాది మంది అభిమానుల మధ్య జరిగింది. 25వ తేది అర్ధరాత్రి నుంచే చిట్టిబాబు నివాసానికి వందలాది మందిగా యువకులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి కేక్‌లు కట్ చేయించి బాణా సంచాలు కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాత్రి 2 గంటల వరకు జన్మదిన సంబరాలు జరిగాయి. సోమవారం 15వ వార్డుకు చెందిన మైనార్టీలు, రజక సంఘం మహిళలు, యువకులు మిగతా వార్డు ప్రజలు ఘనంగా చిట్టిబాబు దంపతులకు స్వాగతం పలికారు. వార్డులో రజక సంఘం భవనం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారీ కేక్‌ను కట్ చేసారు. వార్డు మహిళలు ఆయనను అభినందిస్తూ సంతోషాన్ని వ్యక్తం చేసారు. అనంతరం మైనార్టీ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన వేదికపై కేక్‌ను కట్ చేయించారు.

**500 మందికి చీరల పంపిణీ**

చిట్టిబాబు జన్మదినం సందర్భంగా వార్డులోని 500 మంది మహిళలకు చీరలను పంపిణీ చేసారు. మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు కూడా ఆయన దంపతులను ఆశీర్వదించడం విశేషం. యువకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆత్మకమిటీ డైరెక్టర్ ఖాలీద్ చిట్టిబాబు చేతికి దట్టి కటీ స్వాగతం పలికారు. మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు జన్మదినం సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ ఫోన్ చేసి హ్యాపీ బర్త్‌డే 'చిట్టి' అంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆల్‌ది బెస్ట్ అంటూ ఆశీర్వదించారు. పట్టణంలోని పలువురు కాంగ్రెస్, యువజన సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలియజేసారు.





# ప్రకృతి పునరుజ్జీవనం – వసంతోత్సవం

*** ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ**

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వసంత ఋతువు ఆరంభాన్ని ఆనందంగా స్వాగతించేందుకు జరుపుకునే పండుగని భారతీయ యోగ్ సంస్థాన్ హైదరాబాద్ ప్రతినిధి, ప్రముఖ యోగా మాస్టర్ దేవేందర్ సాంఘీ అన్నారు. చింతల్ శ్రీసాయి కాలనీలోని యోగా హల్ లో.. చింతల్ యోగా యూనిట్ ఆధ్వర్యంలో వసంతోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దేవేందర్ సాంఘీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రకృతిలో రెండు సార్లు మార్పు వస్తుందని అందుకే వసంతోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ప్రకృతి పునరుజ్జీవనం, పుష్పాల వికాసం, కొత్త ఆశలు, ఇవన్నీ ఈ ఉత్సవానికి ప్రతీకలని అన్నారు. చింతల్ యోగా ఇంచార్జ్ ఉమా పార్వతి, కన్నెకంటి శైలజ లు మాట్లాడుతూ.ప్రకృతిలో వచ్చే మార్పు వలన ప్రతి మనిషికి రెండు సార్లు కొత్త రక్తం వస్తుందని, ఈ ఋతువులో సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణలతో ఊరేగింపులు, ఆహారోత్సవాలు, ఋతువుకు తగిన వంటకాలు, స్వీట్లు, కళా ప్రదర్శనలు, పుష్ప ప్రదర్శనలు చేస్తారని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, స్థానిక ఆలయాలలో భక్తి గీతాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, కుటుంబాలు, సమాజం కలసి ఆనందాన్ని పంచుకునే వేడుకని, వసంత ఉత్సవం ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, సంస్కృతి-సంప్రదాయాలను సంరక్షిస్తూ జరుపుకునే ఉల్లాసభరితమైన పండుగని తెలిపారు. అనంతరం సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా సాధక్ లు కన్నెకంటి సంధ్య, సుమతి, కర్ర వాణిరెడ్డి, స్రవంతి, సత్యవాణి, సత్యవతి, రేఖారాణి, విజయలక్ష్మి, ఉమారాణి, భాగ్యలక్ష్మి, వకులదేవి, కన్నెకంటి లక్ష్మన్, రమేష్, టివి చారి, వెంగయ్య, సంతోష్, రఘురామ రాజు, ఎస్. రామారావు, ఏ. రామారావు, బాలవర్ధ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల జిల్లా కేంద్రంలో

# ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా క్యాంప్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నేరుగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ భక్తి గీతాలపై విద్యార్థుల నృత్యాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీస్ శాఖ, చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్, వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో తమ తమ శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి పరిశీలించారు. ఉత్తమ శకటాలు ప్రదర్శించిన శాఖల అధికారులు, విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వివిధ శాఖలకు చెందిన 273 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, డీఎస్పీ నాగేంద్రచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జగద్గిరిగుట్ట డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో నిర్వహించిన వేడుకలలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఆప్షన్ సభ్యులు సయ్యద్ రషీద్,ఆయా ప్రాంతాల నేతలు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జగద్గిరిగుట్ట,రోడమేస్త్రీనగర్ డివిజన్లలో వివిధ కాలనీలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు యువ నాయకులు కొలుకుల జైహింద్,తోపాటు మిత్రబృందం పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎం.శంకర్, ఎండి.మైముద్,ఏ.వినోద్,రాయి రాజేష్,చంద్రశేఖర్. మైలారం రాజు,సత్యనారాయణ,డివిజన్ యూత్ అధ్యక్షులు రాయి విగ్నేష్‌లు పాల్గొన్నారు..

# నిజాంపేటలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం నిజాంపేట్ ప్రగతి నగర్ బండారు లేఅవుట్ కేటీఆర్ కాలనీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో బీజేపీ జిల్లా ఇన్చార్జి ఎస్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్లు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జగద్గిరిగుట్ట 280 డివిజన్లోని పలు ప్రాంతాలలో శేఖర్ యాదవ్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ లీడర్స్ సురేష్ రెడ్డి , సిద్ధిరామి రెడ్డి , ప్రమోద్ , కంటెస్టర్ కార్పొరేటర్ మహేష్ యాదవ్ , శ్రీకాంతాచార్యులు, గండి రాజు యాదవ్, సత్యనారాయణ , కుమార్ యాదవ్, తమిళ్ కుమార్, గోవర్ధన్ గౌడ్, లక్ష్మణ్, ఆనంద్ యాదవ్, సంతోష్‌గౌడ్, బిజెపి నాయకులు, వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్స్ పాల్గొన్నారు


# సంస్కృతి పాఠశాలలో ఘనంగా గణతంత్ర వేడుకలు







(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) : జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప లోని సంస్కృతి పాఠశాలలో ఘనతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డమీది బాలరాజు ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతి క కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఘనతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన ఆటలా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు స్థానిక నాయకులు మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రాజీవ్ గృహకల్ప వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు ప్రభాకర్, నాయకులు నవీన్, వెంకట స్వామి, లక్ష్మణ్, కూన మహాలక్ష్మి నగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





# కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కాంగ్రెస్... దొందు...దొందే..!!

* **పథకాల పేర్ల రాజకీయంపై రచ్చ...రచ్చ**
* **మోదీ–రేవంత్ ఒక్కటేనా...? ఎంపీని నిలదీసిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు**
* **భువనగిరి ఎంపీకి ఓబుల్ కేశవాపూర్‌లో నిరసన సేగ**

(జనగామ/ఓబుల్ కేశవాపూర్, ప్రజస్ఫూర్తి)

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ గ్రామంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి విచ్చేసిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఓబుల్ కేశవాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. గ్రామంలో ధర్నా నిర్వహిస్తున్న ఎంపీని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నల వర్షంతో నిలదీశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన వ్యక్తం చేస్తూ ఎంపీకి మెమోరాండం అందజేశారు. గ్రామంలో



కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం పేరు మార్చితే గల్లీల్లో ధర్నాలు చేస్తున్న మీరు, అదే తరహాలో రాష్ట్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లు మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, మోదీకి మధ్య తేడా ఏముందని వారు ప్రశ్నించారు. రైతుబంధును రైతు భరోసాగా, ఆసరా పెన్షన్లను చేయూతగా, బతుకమ్మ చీరలను ఇందిరమ్మ చీరలుగా, డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా పేరు మార్చారని విమర్శించారు. అలాగే తెలంగాణ తల్లిని పక్కనపెట్టి కాంగ్రెస్ తల్లిని తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ మార్పులన్నింటికి ముందుగా సమాధానం చెప్పాకే గ్రామం నుంచి వెళ్లాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తమ్మలి పరుశరాములు, మాజీ సర్పంచ్ ధర్మ జయప్రకాష్ నారాయణ రెడ్డి,టిఆర్ఎస్ పార్టీ వార్డ్ మెంబర్లు, టిఆర్ఎస్ నాయకులు పంబాల సుధాకర్, టిఆర్ఎస్ పార్టీ గ్రామ యువకుల లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



## డ్రైవింగ్ సీటులోనే కుప్పకూలిన ఆర్టీసీ డ్రైవర్.. ప్రయాణికులు సురక్షితం

చౌటుప్పల్ : డ్రైవింగ్ సీటులోనే ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ కుప్పకూలిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తోన్న బస్సు డ్రైవర్ గుండెపోటుతో ప్రాణాలు విడిచారు. చౌటుప్పల్ వద్ద ఛాతీలో నొప్పి రావడంతో బస్సును సర్వీసు రోడ్డులో డ్రైవర్ ఆపేశాడు. వెంటనే అతడిని ఆటోలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు లేరని చెప్పడంతో.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఈసీజీ తీసి మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుడిని విజయవాడ డిపోలో పనిచేస్తున్న గొల్లపూడికి చెందిన నాగరాజు(38)గా గుర్తించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మియాపూర్ నుంచి అమరావతి బస్సు విజయవాడకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సులోని 19 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు.

## బీసీ కులగణనపై కేంద్రం మోసం చేస్తోంది..
# జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజం



దేశంలో వెనుకబడిన తరగతుల కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మోసానికి పాల్పడుతోందని తెలంగాణ జాగృతి చీఫ్, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఇవాళ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుల్లో ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్రం విడుదల చేసిన కులగణన డాక్యుమెంట్‌లో 'బీసీ' అనే స్పెషల్ కాలమ్ లేకపోవడం బీసీ సామాజిక వర్గాలను అవమానించడమేనని ఆమె మండిపడ్డారు. గతంలో 2011లో కాంగ్రెస్ పార్టీ బీసీలను ఏ విధంగానైతే వంచించిందో ఇప్పుడు 2026లో బీజేపీ ప్రభుత్వం అదే పద్ధతిలో అన్యాయం చేస్తోందని విమర్శించారు.

**29న రౌండ్ టేబుల్ సమావేశం..**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణనపై తప్పుడు గణాంకాలను వెల్లడిస్తోందని, దీంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కవిత ఆరోపించారు. కేవలం ప్రధాన కులాలే కాకుండా, బీసీల్లోని ప్రతి ఉప కులాన్ని కూడా విడివిడిగా లెక్కించాలని తెలంగాణ జాగృతి డిమాండ్ చేస్తోందని అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో బీసీల హక్కుల కోసం తాము 'యుద్ధ భేరి' మోగిస్తామని స్పష్టం చేశారు. బీసీ మేధావులతో సంప్రదింపులు జరుపుతున్నామని.. ఈ మేరకు జనవరి 29న హైదరాబాద్‌లో కీలకమైన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించబోతున్నట్లుగా స్పష్ట చేశారు. ఈ భేటీలో బీసీలు, ఉప కులాలు మరియు సంచార జాతులతో చర్చించి, ఏ కులం ఎంత శాతం ఉందో శాస్త్రీయంగా ఒక నివేదికను తయారు చేస్తామని అన్నారు. ఆ డాక్యుమెంట్‌ను తెలంగాణ జాగృతి తరపున కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి, మా హక్కులను సాధించుకుంటామని కవిత తెలిపారు.



## లోక్‌భవన్‌లో ఘనంగా 'ఎట్ హోం'..
# గవర్నర్ తేనీటి విందుకు ప్రముఖులు

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం 'ఎట్ హోం' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఏర్పాటు చేసిన ఈ తేనీటి విందు రాజకీయ, న్యాయ, అధికార వర్గాల కలయికకు వేదికైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**గవర్నర్స్ అవార్డ్స్ ప్రదానం..**

వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కీలక నేతలు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సైతం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ 'గవర్నర్స్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్'ను ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను ఆయన అభినందిస్తూ, వారి సేవలను కొనియాడారు. తేనీటి విందు అనంతరం గవర్నర్ అతిథులందరినీ పలకరిస్తూ, గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. లోక్‌భవన్ ప్రాంగణమంతా ప్రముఖుల రాకతో సందడిగా మారింది.

## సీఎం విదేశాల్లో ఉన్నప్పుడు
# మంత్రులు సమావేశమైతే తప్పేమీ లేదు

దిల్లీ: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై సీఎం రేవంత్ రెడ్డి విదేశాల నుంచి వచ్చిన తర్వాత హైకమాండ్‌తో చర్చిస్తామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దిల్లీలో పీసీసీ అధ్యక్షులతో సోమవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యారు. సమావేశం అనంతరం మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. సీఎం విదేశాల్లో



ఉన్నప్పుడు పరిపాలన అంశం విషయంలో మంత్రులు సమావేశం జరిపితే తప్పేమీ లేదన్నారు. డిప్యూటీ సీఎం భట్టి రాష్ట్రంలో పరిపాలన విషయంలో సమావేశం జరిపారని అనుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ తీరుపై మహేశ్‌కుమార్ మండిపడ్డారు "గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవకతవకలపై విచారణ జరగాలి. ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధం ఉన్న వారందరికీ నోటీసులు ఇవ్వాల్సిందే. ఈ కేసులో పరిపూర్ణమైన దర్యాప్తు జరగాలి. కాంగ్రెస్‌లోకి కవిత వస్తారనే ప్రస్తావన వచ్చినప్పుడు.. ఆమె తమ పార్టీలోకి అవసరం లేదని చెప్పాను. ఇప్పుడు కూడా అదే మాట చెప్తున్నా. హరీశ్‌రావు, కేటీఆర్ వారి హయాంలో కొంతమందికి లబ్ధి చేకూర్చేందుకే కాంట్రాక్టులు ఇచ్చారు. ఈ విషయాన్ని కవితే స్వయంగా తెలిపారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు.

## మేడారంలో న్యూజిలాండ్ ప్రతినిధులు.. కళాకారులతో మంత్రి సీతక్క నృత్యం

మేడారం: సమ్మక్కసారలమ్మ మహాజాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. విదేశాల నుంచి కూడా భక్తులు వచ్చి గద్దెలను దర్శించుకుంటున్నారు. న్యూజిలాండ్‌కు చెందిన మావోరీ తెగ ప్రతినిధులు సోమవారం మేడారాన్ని సందర్శించారు. మంత్రి సీతక్క చొరవతో వీరు ఈ జాతరకు వచ్చారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో మావోరీ తెగ తమ సంప్రదాయ నృత్యమైన "హాకా" నృత్యాన్ని ప్రదర్శించింది. మంత్రి సీతక్క స్వయంగా కళాకారులతో కలిసి నృత్యం చేశారు. ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని.. ప్రపంచంలో ఎక్కడైనా అడవి, ప్రకృతి మీదే ఆధారపడి జీవనం సాగిస్తారని మంత్రి సీతక్క అన్నారు. అనంతరం మావోరీ తెగ ప్రతినిధులకు మంత్రి వన దేవతల దర్శనం చేయించారు. వన దేవతల వైభవం, చరిత్రను స్వయంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా బంగారం, వన దేవతల ప్రసాదాన్ని అందజేసి తెగ ప్రతినిధులను సన్మానించారు.







## సంతోష్‌కు సిట్ పిలుపు : ప్రభాకర్‌రావు నియామకంపై ప్రశ్నించేందుకే!

హైదరాబాద్: సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో భారాస నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావుకు సిట్ నుంచి పిలుపొచ్చింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో హాజరు కావాలంటూ సిట్ నోటీసులు జారీ చేసింది. ట్యాపింగ్ కేసుకు సంబంధించి పలు విషయాలు తెలిసి ఉంటాయని భావిస్తున్నామని నోటీసులో పేర్కొంది. ఇదే కేసులో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లను ఇప్పటికే సిట్ విచారించి వాంగ్మూలం నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి రెండేళ్ల క్రితం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసును దర్యాప్తు జరిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేయడం, పలువురు పోలీసు అధికారులు అరెస్టవ్వడం తెలిసిందే. అప్పట్లో అమెరికాలో ఉన్న ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) ఓఎస్డీగా పనిచేసిన ప్రభాకర్‌రావు గత జూన్‌లో స్వదేశానికి తిరిగి వచ్చాక దర్యాప్తు ఊపందుకుంది.

# పిట్ట కథలు చెప్పడం వారికి అలవాటు: మంత్రి పొంగులేటి

భూపాలపల్లి జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో రూ.63 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎంపీ కడియం కావ్య, శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భూపాలపల్లి పట్టణంలో చిన్న చిన్న గుడిసెలు వేసుకుని తరతరాలుగా ఉంటున్న కాలనీవాసులు అందరికీ పట్టాలు అందజేస్తాం. ఎమ్మార్వో ఆఫీసులు, ఒక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎన్నికల తర్వాత శంకుస్థాపన చేస్తాం. సింగరేణి కార్మికుల కష్టాలు ప్రత్యక్షంగా చూసినవాడిని, తప్పకుండా శాశ్వత పరిష్కారాలు చూపించే దిశగా ప్రభుత్వ కృషి చేస్తుంది. గ్రామాల్లో నెలకొన్న రైతన్నల సమస్యలను భూ భారతి చట్టం ద్వారా తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు.

**పిట్ట కథలు చెప్పడం వారికి అలవాటు**

ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లు దోచుకున్నారే తప్పా రాష్ట్రానికి చేసింది ఏమీ లేదు. కమీషన్లతో కూడగట్టిన సొమ్ముతో విదేశాల్లో ఆస్తులు కొన్నారు కానీ పేదలకు చేసిందేమీ లేదు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ప్రజా ప్రభుత్వాన్ని కూలగొడతాం, అగ్నిగుండం చేస్తాం అనే అహంకారపు మాటలు, ఎన్నికలు వచ్చినప్పుడు పిట్ట కథలు చెప్పడం వారికి అలవాటుగా మారింది. బీఆర్ఎస్ నేతల చిత్తశుద్ధి, నిజాయితీ ఏంటి అన్నది పేదల ఇండ్లు ఇచ్చే విషయంలోనే తెలిసింది.

# బీఎంసీ ఎన్నికల్లో మెరిసిన జెన్‌జీ..కార్పొరేటర్లుగా 12మంది



మహారాష్ట్రలోని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 28 కార్పొరేషన్లకు ఇటీవల ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. దేశంలోనే ఐశ్వర్యవంతమైన కార్పొరేషన్ బీఎంసీలో 12 ప్రాంతాల్లో జెన్‌జీ వర్గానికి చెందినవారు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన 12మంది జెన్‌జీ యువతలో 22 ఏళ్ల కాశీష్ పుల్వారియా అతి పిన్న వయసున్న కార్పొరేటర్‌గా చరిత్ర సృష్టించింది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాశీష్ పుల్వారియా భాజపా తరఫున వార్డ్ 151 (ఎంవెస్ట్) నుంచి పోటీచేసి గెలిచారు. ప్రస్తుతం ఆమె ఎంబీఏ చదువుతున్నట్లు తెలుస్తోంది. ఆమె తండ్రి రాజేష్ పుల్వారియా గతంలో కార్పొరేటర్‌గా సేవలు అందించారు. 80వ వార్డు నుంచి దిశా యాదవ్ అనే యువతి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఆమె తల్లిదండ్రులు ఇద్దరు మాజీ కార్పొరేటర్లు కావడం గమనార్హం. వృత్తిరీత్యా నగల డిజైనర్ అయిన దిశా సొంతంగా స్టార్టప్ నడుపుతున్నారు. ఎన్నికల్లో 167వ వార్డు నుంచి ఎన్నికైన మరో జెన్‌జీ యువతి డాక్టర్ సమన్ అజ్మీ హోమియోపతిలో వైద్యురాలు. 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది. యూబీటీ 65, కాంగ్రెస్ 24, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన 6, ఏఐఎంఐఎం 8 స్థానాలను గెలుచుకున్నాయి. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ 3 , ఎన్సీపీ(ఎస్పీ) 3 స్థానాలను దక్కించుకున్నాయి. మరికొద్ది రోజుల్లో బీఎంసీకి జనరల్ కేటగిరీ నుంచి మహిళా మేయర్‌ను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

*** పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన చిత్రకారుడి భార్య విన్నపం**



చెన్నై(సైదాపేట): జీవనోపాధికి కష్టపడుతున్నానని, పిల్లల విద్యా రుసుములు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నానని పద్మశ్రీ అవార్డు గ్రహీత చిత్రకారుడు దివంగత ఆర్.కృష్ణన్ భార్య ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని నీలగిరి జిల్లా కొత్తగిరి కుంజప్పనై గ్రామానికి చెందిన ఆలు కురుంబర్ గిరిజన సామాజికవర్గానికి చెందిన చిత్రకారుడు దివంగత ఆర్.కృష్ణన్‌కు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన భార్య సుశీల మీడియాతో మాట్లాడుతూ... తన భర్త తాత రాళ్లు, గోడలపై చిత్రీకరించేవారని తెలిపారు. చిన్న వయసు నుంచి వాటిని చూసి పెరిగిన తన భర్త చిత్రలేఖనం నేర్చుకున్నారన్నారు. వేంగై చెట్టు రసాన్ని ఉపయోగించి పలు రంగులను సృష్టించాడని పేర్కొన్నారు. పలుచోట్ల చిత్రలేఖన ప్రదర్శనలు నిర్వహించారని చెప్పారు. పలువురు ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందారని చెప్పారు. గతేడాది మార్చిలో ఆయన మృతి చెందారని అన్నారు. తన భర్తకు పద్మశ్రీ అవార్డు లభించటం సంతోషంగా ఉందని, ప్రాణాలతో ఉన్నప్పుడు అవార్డు వచ్చుంటే బాగుండేదని అన్నారు. పెద్ద కుమార్తె వాసుకి చదువు మధ్యలో ఆపేసిందని, కుమారుడు రాహుల్ 9వ తరగతి, రెండో కుమార్తె 7వ, చివరి కుమార్తె 4వ తరగతి చదువుతున్నారని చెప్పారు. కూలి పనులు చేసి పిల్లలను పోషిస్తున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ ఫీజు కట్టలేక పెద్ద కుమార్తె చదువు మధ్యలో ఆపాల్సి వచ్చిందని వాపోయారు. నలుగురు పిల్లలతో జీవనోపాధికి కష్టపడుతున్నానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గ్యారంటీ పథకాలతో ప్రజల జీవనంలో మార్పు: సిద్ధరామయ్య

బెంగళూరు: గణతంత్ర దినోత్సవ వేడుకలలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సామాజిక మార్పు, సామాజిక న్యాయం జరగకుండా ఎవరు అడ్డుపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. అలాంటి వారు పేదలను, రైతులు, కార్మికులు, దళితులను దోచుకుంటున్నారని ఆరోపించారు. మనం రాజ్యాంగాన్ని కాపాడితే, అది మనల్ని కాపాడుతుందన్నారు. దేశం కూడా సురక్షితంగా ఉంటుందన్నారు. రాజ్యాంగాన్ని



కాపాడుకోవడానికి మనమందరం ప్రతిజ్ఞ చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఆర్థికంగా వెనకబడిన వారికి కర్ణాటకలో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. సంవత్సరానికి రూ.60 నుంచి 70వేల వరకు ఆ కుటుంబాలకు అందిస్తున్నామన్నారు. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి కుటుంబాలు సంవత్సరానికి రూ.25వేల నుంచి 30వేల వరకు పొందుతున్నారన్నారు. గ్యారంటీ పథకాలు గృహజ్యోతి, శక్తి, యువనిధి ,పిల్లల చదువులకు, ఆరోగ్యానికి, భవిష్యత్ అవసరాలకు ఈ పథకాలు ఉపయోగపడతున్నాయన్నారు. గ్యారంటీ పథకాలతో సమాజంలో ఆర్థిక భద్రత ఏర్పడిందన్నారు.

## మోదీ చెప్పిన 'భజన్ క్లబ్బింగ్'.. ఏంటీ జెన్‌జీ ట్రెండ్..?

కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ.. సరికొత్త ట్రెండ్స్ సృష్టిస్తూ వినూత్నంగా దూసుకెళ్తోంది జెన్‌జీ. ఈ యువతరంగం.. అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఆధ్యాత్మిక బాట పడుతోంది. అందుకు నిదర్శనమే 'భజన్ క్లబ్బింగ్'. ప్రధాని నరేంద్రమోదీ 130వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో దీని గురించి ప్రస్తావించారు. ''భజన్ క్లబ్బింగ్‌ను మన జెన్‌జీ ఆస్వాదిస్తోంది. భజనల పవిత్రతను కాపాడుకుంటూనే.. ఆధ్యాత్మికత, ఆధునికతను అర్థవంతంగా మేళవిస్తోంది'' అని ప్రధాని ఎక్స్ వేదికగా వీడియోను షేర్ చేశారు. దాంతో ఈ క్లబ్బింగ్ గురించి నెటిజన్లు ఆరా తీస్తున్నారు.



**ఏంటీ భజన్ క్లబ్బింగ్..?**

ఈ క్లబ్బింగ్ ఇంతగా వైరల్ కావడం వెనక జెన్‌జీ (Gen Z)నే ఉంది. మద్యం, స్మోకింగ్ లేకుండా నైట్ లైఫ్‌కు కొత్త అర్థం తీసుకువస్తున్నారు. 2024-2025లోనే ఈ ట్రెండ్ ప్రజాదరణ పొందింది. జెన్‌జీతో పాటు మిలీనియల్స్ (1981-1996)ను ఇది ఆకట్టుకుంటోంది. దైవభక్తికి సంబంధించిన భజనలు, కీర్తనలు, శ్లోకాల్లో క్లబ్ వైబ్, ఎలక్ట్రానిక్ బీట్స్, లేజర్ లైట్స్, కచేరీ స్టైల్‌ను మిళితం చేస్తున్నారు. కరోనా మహమ్మారితో వణికిపోయిన యువత మానసిక ఆరోగ్యంపై దృష్టిపెట్టింది. ఈ క్రమంలోనే ఈ ట్రెండ్‌ను పాపులర్ చేసేశారు. దీనిద్వారా జెన్‌జీ తమ మూలాలు, సంప్రదాయాలతో మమేకం అవడానికి ప్రయత్నిస్తోంది. అందుకు ఆధునికత, స్టైల్‌ను జోడిస్తోంది. సోషల్ మీడియాకు దూరంగా సమాజంతో మమేకం కావాలని వారిలో పుట్టుకొచ్చిన ఆలోచన ఈ క్లబ్బింగ్‌వైపు వెళ్లేలా చేస్తోంది. ఈ ఆధ్యాత్మికత వారిలో ప్రశాంతత, ఉత్తేజాన్ని నింపుతోంది. అయితే ఇది జెన్‌జీకి పరిమితమైందే కాదు.. ఏ నేపథ్యం వారైనా ఈ కొత్త తరహా ఆధ్యాత్మికతను ఆస్వాదించొచ్చు . అహ్మదాబాద్, ముంబయి, కోల్‌కతా, దిల్లీలో ఈ ఈవెంట్లు జరుగుతున్నాయి. ఆర్గనైజర్లు భజన్ క్లబ్బింగ్‌లో వెల్‌నెస్ అంశాలను జోడిస్తున్నారు. శ్వాసవ్యాయామాలు, మెడిటేషన్ బ్రేక్స్, పర్యావరణహితమై మన థీమ్‌లతో నిర్వహిస్తున్నారు.ఈ ట్రెండ్ అమెరికా కు కూడా వ్యాపిస్తుండటం గమనార్హం.



## పహల్గాం దాడిలో వీరోచితంగా పోరాడిన హార్స్‌రైడర్‌కు అవార్డు

అత్యుత్తమ ధైర్య సాహసాలు ప్రదర్శించిన 56 మందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జమ్మూకశ్మీర్ ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసింది. వీరిలో పహల్గాం ఉగ్ర దాడిలో వీరోచిత పోరాటం చేసి ప్రాణాలు కోల్పోయిన సయీద్ అదిల్ హుస్సేన్ షా కూడా ఉన్నారు. పహల్గాంలో ఉగ్రవాదుల బుల్లెట్ల నుంచి ప్రాణాలు కాపాడుకోవాలని పర్యటకులు ప్రయత్నించారు. ఆ భయానక పరిస్థితి చూసిన హార్స్‌రైడర్ హుస్సేన్ వీరోచిత పోరాటం చేశాడు. ఉగ్రవాదులు పర్యటకులపై దాడికి దిగగా అడ్డుకునే ప్రయత్నం చేశాడు. వారినుంచి తుపాకీ లాక్కొనేందుకు ప్రయత్నించాడు. అయితే ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో ప్రాణాలు కోల్పోయాడు. హుస్సేన్ ధైర్య సాహసాలకు జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఆయన కుటుంబసభ్యులకు అవార్డుతో పాటు రూ.లక్ష నగదు అందజేసింది. గత ఏడాది ఏప్రిల్ 22న జరిగిన ఈ ఉగ్రదాడిలో 26 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఇందుకు ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'చేపట్టి దీటుగా బదులిచ్చింది.

## రూ.400 కోట్ల కంటైనర్ దోపిడీ.. స్పందించిన కర్ణాటక హోంమంత్రి

బెంగళూరు: గోవాకర్ణాటక సరిహద్దుల్లోని చర్లకొండ మార్గంలో రూ.400 కోట్లను తరలిస్తున్న కంటైనర్‌ను దోపిడీ దొంగలు దారి మళ్లించిన వ్యవహారంపై కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర స్పందించారు. బాధితులు కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేయడానికి సిద్ధమని.. ఈ ఘటనలో వాస్తవాలు వెలుగు చూస్తాయని వెల్లడించారు.




**ఏం జరిగిందంటే..**

గోవాకర్ణాటక సరిహద్దుల్లోని చర్లకొండ మార్గంలో రూ.400 కోట్లను తరలిస్తున్న కంటైనర్‌ను దోపిడీ దొంగలు దారి మళ్లించారు. గుజరాత్ నుంచి మహారాష్ట్ర, గోవా మీదుగా కర్ణాటకలో ప్రవేశించి తిరుపతికి చేరాల్సిన ఆ వాహనాన్ని ఎవరు దారి మళ్లించారనే విషయంపై మహారాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఆరా తీస్తోంది. కర్ణాటకలోని బెలగావిలో ఈ దోపిడీ జరిగినట్లు భావిస్తుండగా.. మహారాష్ట్రలోని నాసిక్‌లో కేసు నమోదైంది. కొన్ని రాష్ట్రాల్లో త్వరలో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలకు ఈ సొమ్ము కాంగ్రెస్ పార్టీ తరలిస్తోందంటూ భాజపా ఆరోపించగా.. అవన్నీ తప్పుడు ఆరోపణలని కర్ణాటక మంత్రులు సతీష్ జార్కి హోలీ, ప్రియాంక్ ఖర్గే కొట్టి పారేశారు. గుజరాత్, మహారాష్ట్ర, గోవాల్లో ఏ ప్రభుత్వం అధికారంలో ఉందో గుర్తించాలని సవాల్ విసిరారు. ఈ కేసులో దర్యాప్తు అధికారులు నలుగురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## రిపబ్లిక్ డేలో 'సిందూర్' స్పెషల్.. సైనిక సత్తాను చాటిన పరేడ్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలు మన సైనిక బలగాల సత్తాను చాటాయి. కర్తవ్యపథ్‌లో జరిగిన ఈ వేడుకల పరేడ్‌లో 'ఆపరేషన్ సిందూర్'లో వాడిన పలు స్వదేశీ ఆయుధ వ్యవస్థల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొలిసారి 'బ్యాటిల్ అరే ఫార్మాట్'లో మన సైన్యం ఈ కవాతు లో పాల్గొంది. అంటే యుద్ధ క్షేత్రంలో పాల్గొంటున్నట్లుగా మన ఆయుధాలు, నిఘా వ్యవస్థలు, బలగాలను ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. 'ఆపరేషన్ సిందూర్ ' థీమ్‌తో రూపొందించిన భారత సైన్యం శకటం మరింత ఆకట్టుకుంది. త్రివిధ దళాల సమన్వయం ఎంత శక్తిమంతంగా ఉంటుందో చాటిచెప్పేలా దీన్ని రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ ఆయుధ వ్యవస్థలు, 300 కి.మీ. దూరం వరకు లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్ వ్యవస్థ, యుద్ధట్యాంకు అర్జున్ వంటివి ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. కొత్తగా ఏర్పడిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్, శక్తిబన్ రెజిమెంట్, రెండు మూపురాల ఒంటెలు, జన్‌స్కార్ గుర్రాలు వంటివి తొలిసారిగా కవాతులో పాల్గొన్నాయి.




పోరులో ధరించే దుస్తులతో అశ్వికదళం కనువిందు చేసింది. అపాచీతో పాటు ప్రచండ్ తేలికపాటి హెలికాప్టర్లు, నాగ్ క్షిపణి వ్యవస్థలు, ధనుష్ తుపాకులు, డ్రోన్లను ఈ పరేడ్‌లో ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో వినియోగించిన ఎస్400 క్షిపణి వ్యవస్థ ఆకట్టుకుంది. మరోవైపు, గగనతలంలో యుద్ధ విమానాలు వివిధ ఆకృతుల్ని ఏర్పరిచాయి. ధ్రువ్ చాపర్ 'సిందూర్' జెండాతో కనిపించింది.

## రిపబ్లిక్ డే పరేడ్‌లో పురుషుల బృందానికి లేడీ లీడ్.. ఎవరీ సిమ్రన్ బాలా?

దిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో 26 ఏళ్ల సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గణతంత్ర దినోత్సవ కవాతులో పారామిలిటరీ దళానికి చెందిన పురుషుల బృందానికి ఆమె నాయకత్వం వహించి, చరిత్ర సృష్టించారు. దేశంలోనే అతిపెద్ద పారామిలిటరీ దళానికి చెందిన 147 మంది పురుష సిబ్బంది బృందాన్ని ఆమె ముందుండి నడిపారు. కర్తవ్యపథ్‌లో ఫోర్స్ బ్యాండ్ వాయించిన 'దేశ్ కే హమ్ హై రక్షక్' అనే సీఆర్‌పీఎఫ్ గీతానికి అనుగుణంగా బృందం కవాతు చేసింది. గణతంత్ర పరేడ్‌లోని బృందాలకు గతంలోనూ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కు చెందిన అధికారిణులు నాయకత్వం వహించినప్పటికీ.. పూర్తిస్థాయిలో పురుషుల బృందానికి ఓ మహిళ నాయకత్వం వహించడం ఇదే మొదటిసారి. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీలో పాక్ సరిహద్దుకు





11 కిలోమీటర్ల దూరంలోని నౌషెరా గ్రామంలో జన్మించిన సిమ్రన్ జమ్మూలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. ఏడాది కిందటే సీఆర్‌పీఎఫ్ దళంలో చేరారు. ఆ జిల్లా నుంచి పారామిలిటరీ దళంలో ఆఫీసర్ హోదాలో చేరిన మొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఆమె ఛత్తీస్‌గఢ్‌లోని 'బస్తారియా' బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. సిమ్రన్ తండ్రి, తాత కూడా ఆర్మీలో పని చేశారు.

**మొదటిసారిగా.. 'సూర్యాస్త్ర'**

పరేడ్‌లో వివిధ ఆయుధ వ్యవస్థల ప్రదర్శనలో భాగంగా 300 కి.మీ. దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే 'సూర్యాస్త్ర' రాకెట్ లాంచర్ వ్యవస్థను ప్రదర్శించారు. మొట్టమొదటిసారిగా ప్రదర్శించిన ఈ 'సూర్యాస్త్ర' బృందానికి భారత సైన్యంలోని ఆర్టిలరీ రెజిమెంట్ అధికారిణి లెఫ్టినెంట్ మెహక్ భాటి నాయకత్వం వహించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ.. పరేడ్‌లో 'సూర్యాస్త్ర' బృందాన్ని లీడ్ చేయడం గర్వంగా ఉందన్నారు.

# ఇరుముడితో రవితేజ కొత్త మూవీ



**టాకీస్:** మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది. పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నారని సమాచారం. సెన్సిటివ్, క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా అన్నది అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.



MOVIE TIME

## ఖైదీ-2పై అనుమానలొద్దన్న లోకేశ్

టాకీస్: ఎవరూ ఊహించని విధంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ తో కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో, కార్తితో చేయాల్సిన 'ఖైదీ 2'ను లోకేశ్ ఆపేశారంటూ ఇటీవల రూమర్స్ వచ్చాయి. వాటిపై దర్శకుడు స్పందించారు. చెన్నైలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్ సినిమా తర్వాత 'ఖైదీ 2'నే తెరకెక్కిస్తానని వెల్లడించారు. ఖైదీ-2 ఉంటుందని, అనుమానాలు వద్దన్నారు.

## మరోసారి పోలీసు అధికారిణిగా.. రాణిముఖర్జీ

మహిళల అక్రమ రవాణా.. కిడ్నాప్ లాంటి అంశాలతో రూపొంది మంచి హిట్ బొమ్మ అనిపించుకున్నాయి 'మర్దానీ' చిత్రాలు. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్



రాజ్‌ఫిల్మ్స్ నిర్మించిన ఈ సినిమాలు ఇప్పటికే రెండు భాగాలుగా విడుదలై ప్రేక్షకుల్ని మెప్పించాయి. తాజాగా ఈ ఫ్రాంచైజీలో 'మర్దానీ 3' రాబోతోంది. రాణి ముఖర్జీ మరోసారి పోలీసు అధికారిణి శివానీ రాయ్ పాత్రలో కనిపించనున్నారు. జనవరి 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సెలెక్టెడ్‌గానే ఐటమ్ సాంగ్స్ చేస్తా: రష్మిక



టాకీస్: ఒకప్పుడు సినిమాల్లో ఐటం పాట అంటే ప్రత్యేకంగా ప్రొఫెషనల్ డాన్సర్లే గుర్తొచ్చేవారు. ఆ పాటల్లో వాళ్లు కనిపిస్తేనే హిట్ అనే స్టాండర్డ్ ఉండేది. కానీ కాలం మారింది. ఇప్పుడు అదే సినిమాలో హీరోయిన్‌గా నటించిన నటీమణులే ఐటం సాంగ్స్‌లోనూ స్టెప్పులేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఒకే సినిమాలో హీరోయిన్ పారితోషికంతో పాటు స్పెషల్ సాంగ్ ఫీజు కూడా అందుకుంటూ డబుల్ లాభం పొందుతున్నారు.ఈ ట్రెండ్‌కు అనుగుణంగానే గత కొన్నేళ్లుగా సమంత, కాజల్ అగర్వాల్, తమన్నా, పూజా హెగ్డే, శ్రీలీల వంటి స్టార్ హీరోయిన్లు ఐటం పాటల్లో కనిపించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ ఇదే ట్రెండ్ బలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పెద్ద సినిమాల్లో ఐటం సాంగ్ అంటే స్టార్ హీరోయిన్ ఉండాల్సిందే అనే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్నా కూడా ఈ దారిలోకి అడుగుపెట్టింది. బాలీవుడ్ డెబ్యూ 'గుడ్‌బై'లో నటిగా మెప్పించిన ఆమె, తర్వాత వచ్చిన 'థామా' చిత్రంలో నటనతో పాటు స్పెషల్ సాంగ్‌లోనూ తనదైన స్టైల్‌లో ఆకట్టుకుంది. ఆ పాట తర్వాత రష్మికపై ఐటం భామగా కూడా డిమాండ్ పెరిగింది. దర్శక, నిర్మాతలు 'హీరోయిన్‌గా తీసుకున్నా, ఐటం సాంగ్‌కు కూడా ఒప్పించొచ్చు' అనే ధీమాతో ఆమె వైపు చూస్తున్నారనే టాక్ వినిపించింది. కానీ ఇదే సమయంలో రష్మిక ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాను నటిగా అయినా, ఐటం భామగా అయినా కేవలం ఇద్దరు దర్శకుల సినిమాల్లో మాత్రమే స్పెషల్ సాంగ్స్ చేస్తానని, అంతకుమించి ఈ విషయంలో చాలా సెలెక్టివ్‌గా ఉంటానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రష్మికపై భారీ ఆశలు పెట్టుకున్న కొంతమంది దర్శకులు ఈ షరతులతో కాస్త నిరాశకు గురైనట్లు సమాచారం. తెలుగులో లేడీ ఓరియెంటెడ్ సినిమా 'మైసా'లో కీలక పాత్రలో నటిస్తుండగా, విజయ్ దేవరకొండ 14వ సినిమాలోనూ హీరోయిన్‌గా ఎంపికైంది. మరోవైపు బాలీవుడ్‌లో 'కాక్‌టెయిల్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. నటిగా, డాన్సర్‌గా తనను తాను విభిన్నంగా ప్రెజెంట్ చేసుకుంటూనే, అవసరమైతేనే ఐటం పాటలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నదే రష్మిక స్ట్రాటజీగా కనిపిస్తోంది.

## నీల్-ఎన్టీఆర్ కాంబినేషన్ డ్రాగన్ తుదిదశకు షూటింగ్

జూన్ 25న విడుదల చేసేలా ప్లాన్



టాకీస్: యంగ్ టైగర్ ఎన్టీఆర్ స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్-ఇండియన్ సినిమా పై తాజాగా క్రేజీ అప్‌డేట్ బయటికి వచ్చింది. వర్కింగ్ టైటిల్: డ్రాగన్ పేరుతో ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో దూసుకుపోతోంది. తాజాగా ఈ సినిమా ప్రస్తుత షెడ్యూల్ షూటింగ్ హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో విజయవంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఎక్కువగా నైట్ ఎఫెక్ట్‌తో నైట్ షూటింగ్ నిర్వహించారని టాక్. తదుపరి షెడ్యూల్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు సమాచారం. ప్రశాంత్ నీల్ అంటేనే భారీ యాక్షన్, డార్క్ టోన్, పవర్‌ఫుల్ ఎలివేషన్లు గుర్తుకు వస్తాయి. అదే ఫార్ములాను ఈసారి ఎన్టీఆర్ స్థాయికి మించి చూపించేందుకు దర్శకుడు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్యూర్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో యాక్షన్ సీక్వెన్సులు అత్యంత ఇంటెన్స్‌గా ఉండబోతున్నాయట. ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ యాక్షన్ రోల్స్‌లో ఇది ఒకటిగా నిలుస్తుందనే టాక్ వినిపిస్తోంది.ఇప్పటి వరకు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన అన్ని సినిమాల్లోకెల్లా ఇదే బెస్ట్ మూవీ అవుతుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌసెస్‌గా గుర్తింపు పొందిన మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్నాయి. భారీ బ్జడెట్‌తో, పాన్-ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. రవి బస్రూర్ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్, కీలక పాత్రలో అనిల్ కపూర్ కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా అన్ని భాషల్లో ప్రేక్షకులను ఆకట్టుకునేలా పాన్-ఇండియన్ ప్రాజెక్ట్‌గా రూపొందుతోంది. జూన్ 25 సినిమాని విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు.

## 30న వస్తున్న విజయ్ సేతుపతి గాంధీ టాక్స్





**టాకీస్:** టాకీ యుగం ప్రారంభమైన తర్వాత వచ్చిన అతి తక్కువ ప్రయోగాత్మక చిత్రాల్లో 'పుష్పక విమానం' ఒకటి. ఆ కోవలో మళ్లీ ఇన్నేళ్ల తర్వాత మూవీ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది 'గాంధీ టాక్స్'.విజయ్ సేతుపతి, అదితీరావ్ హైదరీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుందీ సినిమా. ఈ నెల 30న థియేటర్లలో విడుదల కానుంది. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

## చిత్రపరిశ్రమకు వచ్చే వారిని ప్రోత్సహించాలి



టాకీస్: సినిమా ఇండస్ట్రీలోకి వచ్చి పనిచేస్తానని ఏ ఆడబిడ్డ, మగబిడ్డ అయినా అంటే వారిని ప్రోత్సహించి పంపాలని, తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పదని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. జీవితాంతం ప్రేక్షకులను అలరిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన కీలక పాత్రలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మన శంకరవరప్రసాద్‌గారు' భారీ విజయాన్ని అందుకుని రూ.300 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఈ సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చిరంజీవి మాట్లాడారు. మళ్లీ విజయోత్సవాలను జరుపుకొనే వైభవాన్ని తీసుకొచ్చిన ఘనత దర్శకుడు అనిల్ రావిపూడికి దక్కుతుంది. ఇంతటి ఘన విజయాన్ని అందించిన తెలుగు సినీ ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమా టీమ్ విజయానందాన్ని అనుభవిస్తుంటే, నాకూ సంతోషంగా ఉంది. అనిల్‌ను చూస్తుంటే రాఘవేంద్రరావుగారు గుర్తుకు వచ్చేవారు. రోజు సెట్‌లో వినోదాన్ని పంచేవారు. ఈ మూవీ షూటింగ్‌కు వెళ్తుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ప్రతి సినిమా కష్టపడి పనిచేస్తాం. కానీ, కొన్ని సినిమా ఫలితాలు ఉత్సాహాన్ని ఇస్తాయి.

## మయసభ 30న విడుదల




**టాకీస్:** 'తుంబాడ్' వంటి వైవిధ్యమైన కథతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఇప్పుడు మరో సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'మయసభ'. జావేద్ జాఫ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'బంగారం వేటకు మీకు స్వాగతం' అంటూ చిత్ర బృందం విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు నటిస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.